క్లుప్తంగా

మడూరులో హెచ్ఐవీపై అవగాహన

చాపాడు : మండలంలోని మడూరు గ్రామంలో బుధవారం చైల్డ్ ఫండ్ ఇండియా లింక్ వర్కర్ స్కీం ఆధ్వర్యంలో హెచ్ఐవీపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సచివాలయం వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో పంచాయతీ కార్యదర్శి భాగ్యలక్ష్మి మాట్లాడుతూ ప్రజలందరూ హెచ్ఐవీపై అవగాహన కలిగి ఉండాలన్నారు. హెచ్ఐవీ పట్ల జాగ్రత్తలు వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ దర్బార్, ఏఎన్ఎం వనజ, లింక్ వర్కర్ సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.

కల్వర్టు నిర్మాణానికి భూమిపూజ

ప్రొద్దుటూరు : కొత్తపల్లె గ్రామ పంచాయతీ సర్పంచ్ కొనిరెడ్డి శివచంద్రారెడ్డి స్వగ్రామమైన కానపల్లెలో మడూరు కాలువపై కల్వర్టు నిర్మాణానికి ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద రెడ్డి బుధవారం భూమి పూజ చేశారు. రూ.20లక్షల జనరల్ ఫండ్‌తో ఈ నిర్మాణం చేపట్టినట్లు సర్పంచ్ శివచంద్రారెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ సానబోయిన శేఖర్ యాదవ్, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి పోరెడ్డి నరసింహారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి కల్లూరు నాగేంద్రారెడ్డి, కొనిరెడ్డి హర్షవర్ధన్ రెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

సరస్వతిదేవి అలంకారంలో పెద్దమ్మతల్లి

మైదుకూరు : గ్రామ దేవత పెద్దమ్మ తల్లి 24వ ప్రతిష్ఠ మహోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఉత్సవాల్లో మూడో రోజు బుధవారం పెద్దమ్మతల్లి సరస్వతి దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు.

రేపటి నుంచి విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు

చాపాడు : మండలంలోని నాగాయపల్లె గ్రామంలో నూతనంగా నిర్మించిన హనుమత్ సమేత సీతారామ లక్ష్మణ ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ వేడుకలు శుక్రవారం నుంచి ఆదివారం వరకు ఘనంగా నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. హోమాలు, పూజలు, అభిషేకాలు, వివిధ క్రతువులు చేయనున్నట్లు తెలిపారు. అనంతరం సీతారాముల కల్యాణాన్ని వైభవంగా నిర్వహిస్తామన్నారు. ఆదివారం న్యూ కేటగిరి వృషభరాజముల చే బండలాగుడు పోటీలు నిర్వహించి గెలుపొందిన ఎడ్ల ఎజమానులకు నగదు బహుమతులు ఇవ్వనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

సచివాలయ మండల కన్వీనర్‌గా రామ్మోహన్‌రెడ్డి

చాపాడు : మండల గ్రామ సచివాలయ కన్వీనర్ల మండల కన్వీనర్‌గా మాజీ మార్కెట్ యార్డు చైర్మన్, పల్లవోలు రామ్మోహన్‌రెడ్డి నియమితులయ్యారు. ఇటీవల వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో గ్రామ సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులను నియమించింది. ఈ మేరకు మైదుకూరు ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి పర్యవేక్షణలో మండలంలోని అన్నవరం గ్రామానికి చెందిన రామ్మోహన్‌రెడ్డికి కన్వీనర్ బాధ్యతలు అప్పగించారు. ప్రభుత్వ పథకాలను ప్రజలకు అందించేలా, వైఎస్సార్‌సీపీ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు.

అల్లాడుపల్లె ఆలయ ఆదాయం రూ.10.04లక్షలు

చాపాడు : మండలంలోని ముఖ్య పుణ్యక్షేత్రమైన అల్లాడుపల్లె శ్రీవీరభద్ర స్వామికి హుండీల ద్వారా రూ.10.04లక్షల ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈఓ శ్రీనివాసులు తలిపారు. ఆలయ ప్రాంగణంలో బుధవారం భక్తులు సమర్పించిన కానుకలను బుధవారం జిల్లా దేవాదాయ శాఖ అధికారులు ఆదేశాల మేరకు ఆలయ చైర్మన్ జీటీ వెంకటసుబ్బారెడ్డి, పాలకమండలి సభ్యులు పర్యవేక్షణలో హుండీలను లెక్కించారు. కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వెల్లాల ఆలయ జీర్ణోద్ధరణకు రూ.2.90 కోట్లు మంజూరు


మాట్లాడుతున్న ఆలయ చైర్‌పర్సన్ కానాల విజయలక్ష్మి, ఈఓ నరసయ్య

రాజుపాళెం : రాజుపాళెం మండలంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన వెల్లాల గ్రామంలోని శ్రీచెన్నకేశవ, సంజీవరాయస్వామి ఆలయాల జీర్ణోద్ధరణకు రూ.2.90 కోట్లు రాష్ట్ర దేవాదాయశాఖ కామన్ గుడ్ ఫండ్ కింద నిధులు మంజూరు చేసినట్లు ఆలయ చైర్‌పర్సన్ కానాల విజయలక్ష్మి, ఈఓ నరసయ్య తెలిపారు. వెల్లాల ఆలయాల్లోని ధ్యాన మందిరంలో బుధవారం సాయంత్రం విలేకరులతో వారు మాట్లాడారు. నిధులు మంజూరు చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, చేయించినందుకు ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డికి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు బలరామిరెడ్డి, అర్చకులు శేషాచార్యులు పాల్గొన్నారు.

నేడు వివేకానంద కాలనీలో గడపగడపకు మన ప్రభుత్వం

ప్రొద్దుటూరు : మండలంలోని కొత్తపల్లె గ్రామ పంచాయతీలోని వివేకానంద కాలనీలో గురువారం ఉదయం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మార్తల ఓబుళరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి పాల్గొంటారని వివరించారు.

పథకాల లబ్ధిని వివరించండి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి


పాల్గొన్న కన్వీనర్లు, గృహ సారథులు, పార్టీ కార్యకర్తలు

మైదుకూరు : సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాల వల్ల పొందిన లబ్ధిని సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు ఇంటింటికి వెళ్లి వివరించాలని ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి అన్నారు. బుధవారం మైదుకూరులోని ఎస్‌సీసీఆర్ కల్యాణ మండపంలో ఎమ్మెల్యే ఆధ్వర్యంలో మున్సిపాలిటీ, మండలంలోని సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులకు శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రఘురామిరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని వర్గాల సంక్షేమ కోసం వైఎస్ జగన్ నవరత్నాలను అమలు చేస్తున్నారన్నారు. చంద్రబాబు 2014 ఎన్నికల సమయంలో మహిళలు, రైతులకిచ్చిన హామీలను తుంగలో తొక్కి మోసం చేశారని ఆరోపించారు. చంద్రబాబు పాలనను, వైఎస్ జగన్ పాలనను బేరీజు వేసుకోవాలన్నారు. సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు వైఎస్సార్‌సీపీ బ్యాడ్జీ ధరించి ఈనెల 20వ తేదీ నుంచి 27లోపల ఇంటింటికి తిరిగి సంక్షేమ పథకాల వల్ల పొందిన లబ్ధిని వివరించాలని, అర్హత ఉండి పథాకలందని వారిని గుర్తించాలని తెలిపారు.

వైఎస్ జగన్‌ను 2024 ఎన్నికల్లో గెలిపించి తిరిగి సీఎం చేసుకోవాల్సిందిగా కన్వీనర్లు, గృహ సారథులు ప్రజలను కోరాలని నియోజకవర్గ పరిశీలకుడు చొప్పా ఎల్లారెడ్డి అన్నారు. తెలుగుదేశం హయాంలో జన్మభూమి కమిటీలదే పెత్తనమని, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ప్రతి ఒక్కరికీ పథకాలు వర్తింపజేశారన్నారు.

రాష్ట్రాన్ని 20 నెలల పాటు కరోనా ఆర్థికంగా అతలాకుతలం చేసినా టీచర్లకు, ఉద్యోగులకు ప్రతినెలా జీతాలిచ్చిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదేనని పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ వైఎస్సార్‌సీపీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డి అన్నారు. బాబు వస్తే జాబు వస్తుందని చెప్పి చంద్రబాబు నిరుద్యోగులను మోసం చేశారని ఆరోపించారు. వైఎస్ జగన్ లక్షా 36వేల మందికి సచివాలయ ఉద్యోగాలు ఇచ్చి నిరుద్యోగులను ఆదుకున్నారని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మాచనూరు చంద్ర, మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీమన్నారాయణరెడ్డి, కిరణ్మయి, గల్లా నరసింహారెడ్డి, కేపీ లింగన్న, జెడ్పీటీసీ వెంకటసుబ్బారెడ్డి, ఎంపీపీ థామస్, వైస్ ఎంపీపీ రఘురామిరెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్లు షరీఫ్, భరత్ కుమార్‌రెడ్డి, సింగిల్ విండో చైర్మన్ మూలె సుధాకర్ రెడ్డి, మండల కోఆప్షన్ సభ్యుడు ఇంతియాజ్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

శ్మశాన వాటికలో రోడ్లు, లైటింగ్ సౌకర్యం కల్పించాలి

ప్రొద్దుటూరు : స్థానిక జామియా మసీదు ప్రాంగణంలో ఉన్న ముస్లిం శ్మశాన వాటికలో సిమెంటు రోడ్ల నిర్మాణంతోపాటు లైటింగ్ సౌకర్యం, ఇతర సదుపాయలను మున్సిపాలిటీ ద్వారా ఏర్పాటు చేయాలని మున్సిపల్ వైస్ చైర్మన్ సీఎస్ ఖాజామొహిద్దీన్ బుధవారం మున్సిపల్ కమిషనర్ వెంకటరమణయ్యకు వినతిపత్రమిచ్చారు. శ్మశాన వాటికను పరిశీలించి అభివద్ధి పనులు చేపడతామని కమిషనర్ తెలిపారు. కార్యక్రమంలో 19వ వార్డు కౌన్సిలర్ మునీర్, 22వ వార్డు కౌన్సిలర్ మహ్మద్ గౌస్, మైనార్టీ నాయకులు పాల్గొన్నారు.

రూ.10వేలు ఆర్థిక సహాయం

గతంలో ఇచ్చిన హామీ మేరకు 12వ వార్డు పరిధిలోని మసీదు వెనుక నివసిస్తున్న జిలాని సతీమణికి మునిస్పల్ వైస్ చైర్మన్ ఖాజా మొహిద్దీన్ రూ.10వేలు ఆర్థిక సహాయం అందించారు.

ప్రజలకు మెరుగైన సేవలందించాలి

గోపవరం : వివిధ సమస్యలపై సచివాలయానికి వచ్చే ప్రజలకు మెరుగైన సేవలందించాలని మండల ప్రత్యేకాధికారి ఎం.నాగరాజ తెలిపారు. బుధవారం మండలంలోని బ్రాహ్మణపల్లె సచివాలయంలో సిబ్బందితో కలిసి సమీక్షా సమావేశం నిర్వహించారు. వలంటీర్లు, సచివాలయ సిబ్బంది సమన్వయంతో ప్రజలకు సేవలందించాలన్నారు. సమయపాలన పాటిస్తూ ప్రజలకు అందుబాటులో ఉండాలని తెలిపారు. యూనిఫాం ధరించకుండా అధిక శాతం సిబ్బంది సచివాలయాలకు వస్తున్నారని, ప్రతిఒక్కరు యూనిఫాం ధరించి విధులకు హాజరు కావాలన్నారు. ఇప్పటి వరకు అర్హులై ఉండి సంక్షేమ పథకాలు అందని వారి వివరాలను పరిశీలించి ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. అనంతరం ప్రాథమిక పాఠశాల, అంగన్వాడీ కేంద్రాలను ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. జగనన్న గోరుముద్ద పక్కాగా అమలు కావాలని, అలాగే చిన్నపిల్లలకు పౌష్టికాహారం సక్రమంగా అందించాలన్నారు. ప్రత్యేకాధికారి వెంట ఎంపీడీఓ హరినారాయణ, రూరల్ ఎస్ఐ చంద్రశేఖర్, పంచాయతీ కార్యదర్శి మోశ తదితరులు ఉన్నారు.

అయోడిన్ ఉప్పును వాడాలి

ప్రొద్దుటూరు క్రైం : ప్రజలు అయోడిన్ ఉప్పును వాడాలని డిప్యూటీ డీఎంహెచ్ఓ శాంతికళ తెలిపారు. నేషనల్ అయోడిన్ డెఫిసియన్సీ డిసార్డర్ కంట్రోల్ ప్రోగ్రామ్‌లో భాగంగా బుధవారం స్థానిక టీచర్స్ కాలనీలోని రాఘవేంద్ర హైస్కూల్‌ను ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 6 నుంచి 12 ఏళ్లలోపు గల 45 మంది అబ్బాయిలు, 40 మంది అమ్మాయిలలో రాండమ్‌గా ప్రతి 5 మందికి ఒకరి చొప్పున 18 మందిని ఎంపిక చేశామన్నారు. వారి ఇళ్లలో వాడుతున్న ఉప్పును తెప్పించి ప్రతి 10 మందికి ఒకరు చొప్పున 10 మందిని ఎంపిక చేసి వారి మూత్రాన్ని శాంపిల్ తీసుకుని ల్యాబ్‌కు పంపామని తెలిపారు. అయోడిన్ లోపం వలన వచ్చే గాయిటర్ వ్యాధి నిర్ధారణ కోసం విద్యార్థులకు పరీక్షలు చేస్తున్నట్లు వైద్యాధికారి డాక్టర్ శివప్రసాద్‌రెడ్డి తెలిపారు. హెల్త్ ఎడ్యుకేటర్ వెంకటేశ్వర్లు, హెచ్ఈఓలు వెంకటేశ్వర్లు, రాజశేఖర్, హెచ్ఎం కిరణ్మయి, సీహెచ్ఓ మౌనిక, ఏఎన్ఎం శ్యామల పాల్గొన్నారు.

భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించాలి

గోపవరం : శివరాత్రి పర్వదినం సందర్భంగా మల్లెంకొండేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించాలని మండల ప్రత్యేకాధికారి ఎం.నాగరాజ తెలిపారు. బుధవారం అన్నిశాఖల అధికారులతో కలిసి కొండ దిగువ భాగాన బ్రహ్మోత్సవాల ఏర్పాట్లను పరిశీలించారు. ఈనెల 18 నుంచి 20వ తేదీ వరకు మూడు రోజుల పాటు మల్లెం కొండేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నారు. ఈ బ్రహ్మోత్సవాలకు వైఎస్సార్ జిల్లాతో పాటు నెల్లూరు, ప్రకాశం, కర్నూలు జిల్లాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున రానున్నందున కొండపైన, కొండ దిగువ భాగాన అన్ని వసతులు సమకూర్చాలని అన్నిశాఖల అధికారులను ప్రత్యేకాధికారి ఆదేశించారు. ఆర్టీసీ వారు ప్రత్యేక బస్సులను కూడా నడిపేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఎంపీడీఓ హరినారాయణ, ఆర్ఐ అమర్‌నాథ్‌రెడ్డి, రూరల్ ఎస్ఐ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

నేడు పీతాంబర ఛత్రోత్సవం

గోపవరం : మల్లెంకొండేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా ముందస్తుగా గురువారం స్వామి వారి పీతాంబర ఛత్రోత్సవం నిర్వహించనున్నట్లు దేవాదాయశాఖ ఈఓ సి.శివయ్య తెలిపారు.

మురుగు కాలువల సమస్యలను పరిష్కరిస్తాం


సంక్షేమ బావుటాను అందిస్తున్న ఎమ్మెల్యే రాచమల్లు


కంకర గోళాలను మోస్తున్న ఎమ్మెల్యే

గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి

ప్రొద్దుటూరు : మండలంలోని కొత్తపల్లె గ్రామ పంచాయతీ వివేకానంద కాలనీలో డ్రైనేజీ కాలువలను నిర్మించి సమస్య పరిష్కరిస్తామని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి తెలిపారు. సర్పంచ్ కొనిరెడ్డి శివచంద్రారెడ్డి ఆధ్వర్యంలో బుధవారం వివేకానంద కాలనీలో నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఎమ్మెల్యే ఇంటింటికి తిరిగి ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించడంతోపాటు సంక్షేమ బావుటా బుక్‌లెట్‌ను అందించారు. అనంతరం ఎమ్మెల్యే ప్రభుత్వ పాఠశాలను సందర్శించారు. కార్యక్రమంలో కొనిరెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి, ఆప్కాబ్ చైర్‌పర్సన్ మల్లేల ఝాన్సీరాణి రాజారాంరెడ్డి, ఎంపీపీ శేఖర్ యాదవ్, ఎంపీటీసీ పేరం సునీత తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే రాచమల్లు శ్రమదానం

ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి బుధవారం ఒంటరి మహిళ ఇంటి నిర్మాణానికి శ్రమదానం చేశారు. మున్సిపాలిటీ పరిధిలోని 23వ వార్డులో ఆసారే షరీఫ్ వీధిలో ఖురాన్ బోధించే వృద్ధురాలు బీబీ జాన్ ఒంటరిగా ఉంటూ ఇల్లు లేకుండా ఇబ్బందులు పడుతోంది. గతంలో ఇంటి నిర్మాణానికి భూమి పూజ చేసిన ఎమ్మెల్యే బుధవారం స్లాబ్ నిర్మాణ పనుల్లో దగ్గరుండి శ్రమదానం చేయడం విశేషం. రంజాన్ నాటికి ఇంటి నిర్మాణం పూర్తి చేసి అవ్వను ఇంటిలో చేర్పిస్తామని తెలిపారు.

లెప్రసీ వ్యాధిపై అవగాహన సదస్సు

బ్రహ్మంగారిమఠం : మండల కేంద్రంలోని గురుకుల పాఠశాలలోని విద్యార్థులకు స్థానిక ప్రాథమిక కేంద్రం హెల్త్ సూపర్‌వైజర్ పుష్పరాజ్ ఆధ్వర్యంలో లెప్రసీ వ్యాధిపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా పుష్పరాజ్ మాట్లాడుతూ గతనెల 30న గాంధీ జయంతిని పురస్కరించుకొని ఫిబ్రవరి 13 వరుకు లెప్రసీపై అవగాహన సదస్సులు నిర్వహిస్తునట్లు తెలిపారు. స్పర్శలేని రాగిరంగు, పాలిపోయిన మచ్చలు, దురద ఉండకపోవడం, చెమట పట్టకపోవడంవంటి లక్షణాలతో ఉన్న మచ్చలను లెప్రసీవ్యాధిగా గుర్తించాలన్నారు. ఈకార్యక్రమంలో వైద్య సిబ్బంది, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

స్పర్శలేని మచ్చలుంటే పరీక్షలు చేయించుకోవాలి

ప్రొద్దుటూరు క్రైం : శరీరంపై స్పర్శలేని మచ్చలుంటే ఆస్పత్రికి వెళ్లి పరీక్షలు చేయించుకోవాలని డాక్టర్ హనీఫ్‌బాబా తెలిపారు. పొట్టిపాడు రోడ్డులోని ప్రభుత్వ హాస్టళ్లలో బుధవారం విద్యార్థులకు కుష్టువ్యాధిపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కామనూరు పీహెచ్‌సీ వైద్యాధికారి హనీఫ్‌బాబా మాట్లాడుతూ ప్రతి విద్యార్థి స్వీయ పరీక్ష చేసుకొని స్పర్శలేని మచ్చలుంటే వెంటనే ఆరోగ్య సిబ్బందిని సంప్రదించాలన్నారు. హెల్త్ ఎడ్యుకేటర్ శోభారాణి, సూపర్‌వైజర్ వరప్రసాద్, సాంఘిక సంక్షేమ అధికారులు పాల్గొన్నారు.

భక్తులకు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేయాలి

బద్వేలు అర్బన్ : ప్రముఖ శైవక్షేత్రమైన లంకమల రామలింగేశ్వరస్వామి ఆలయంలో ఈనెల 18వ తేదీన జరగబోవు శివరాత్రి వేడుకల్లో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేయాలని మండల తహసీల్దారు వై.మధుసూదన్‌రెడ్డి, ఎంపీడీఓ రామకృష్ణయ్యలు తెలిపారు. బుధవారం లంకమల క్షేత్రంలోని ఆలయ ఆవరణలో వివిధ శాఖల అధికారులతో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ శివరాత్రి సందర్భంగా లంకమలకు వేలాదిగా భక్తులు తరలివస్తారని, వారందరికీ తాగునీటి సౌకర్యం కల్పించడంతో పాటు ఇతర వసతులకు ఏర్పాట్లు చేయాలని అధికారులను కోరారు. అలాగే ఆలయ పరిసరాల్లో మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేయాలని, అంతేకాకుండా ట్రాఫిక్ సమస్యలు ఉత్పన్నం కాకుండా గట్టి చర్యలు తీసుకోవాలన్నారు. మద్యం, ఇతర మత్తు పదార్థాల విక్రయాలు జరగకుండా ఎక్సైజ్ అధికారులు గట్టి నిఘా ఏర్పాటు చేయాలన్నారు. సమావేశంలో ఆలయ చైర్మన్ నారపురెడ్డిశంకర్‌రెడ్డి, పంచాయతీరాజ్, పోలీసు, ఆర్‌డబ్ల్యూఎస్, అటవీశాఖ, వైద్యశాఖల అధికారులు, ఆలయ అర్చకులు పాల్గొన్నారు.

సర్పంచ్ చొరవకు.. ఎమ్మెల్సీ ప్రశంసలు

బద్వేలు : విద్యుత్ ఆదా చేసేందుకు వీధి దీపాలకు సొంత నిధులతో ఆటోమేటిక్ స్విచ్‌లను ఏర్పాటు చేస్తున్న రంగసముద్రం సర్పంచ్ చిత్తా రవిప్రకాష్‌రెడ్డిని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి ప్రశంసించారు. బుధవారం పోరుమామిళ్లలోని పార్టీ కార్యాలయంలో ఆటోమేటిక్ స్విచ్‌లను ఆయన పరిశీలించి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ తనతో పాటు ఎమ్మెల్యే డాక్టర్ దాసరి సుధ ప్రతి పంచాయతీలో పగలు వెలుగుతున్న వీధి దీపాలను చూసి ఇందుకు సరైన పరిష్కారం చూపాలని రవి ప్రకాష్‌రెడ్డికి చెప్పామన్నారు. దీనిపై ఆయన స్పందించి ఇంటర్నెట్‌లో శోధించి పగలు ఆటోమేటిక్‌గా ఆగిపోయే స్విచ్‌లను తెప్పించి ప్రయోగాత్మకంగా పరిశీలించారని, సంతృప్తికరంగా పని చేస్తుండటంతో సొంత ఖర్చుతో వెయ్యి స్విచ్‌లను తెప్పించారని చెప్పారు. వీటి వినియోగంతో విద్యుత్ ఆదా కావడంతో పాటు వీధి దీపాల ఎక్కువ కాలం మన్నుతాయన్నారు. పంచాయతీలో ప్రయోగాత్మకంగా అన్ని దీపాలకు వీటిని అమరుస్తున్నారని చెప్పారు. దీనికి చొరవ చూపిన సర్పంచ్ రవిప్రకాష్‌రెడ్డిని ఆయన అభినందించారు. కార్యక్రమంలో బద్వేలు మార్కెట్ యార్డు మాజీ వైస్ చైర్మన్ కల్లూరు రమణారెడ్డి, పోరుమామిళ్ల జడ్పీటీసీ ముత్యాల ప్రసాద్, సీఐ సురేష్‌రెడ్డి, చాపాటి సాయి నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జేఈఈ మెయిన్స్‌లో 'భీరం' విద్యార్థుల సత్తా


విద్యార్థులను అభినందిస్తున్న కరస్పాండెంట్ భీరం సుబ్బారెడ్డి

ఖాజీపేట : భీరం శ్రీధర్‌రెడ్డి జూనియర్ కళాశాల మొదటి ఏడాదిలోనే ఉత్తమ ఫలితాలు సాధించి ఘనవిజయం సాధించిందని విద్యార్థులకు అభినందనలు అని భీరం శ్రీధర్‌రెడ్డి కళాశాల కరస్పాండెంట్ సుబ్బారెడ్డి, చైర్‌పర్సన్ సరస్వతమ్మ అన్నారు. భీరం శ్రీధర్‌రెడ్డి పాఠశాలలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు వి.ఓబుల్‌రెడ్డి(99.92) కె. బాలాజీ (99.14) సి.మహిత్‌కుమార్ (98.68) చంద్రమౌళియన్‌రెడ్డి (97.37) ఆర్‌వీఎస్ రామరూపేస్ (98.67) ఎంఆర్ఎస్ సాయితేజ (98.61) కె.వేదామృత (98.60) ఉమామహేశ్వర్‌రెడ్డి (97)తోపాటు ఇంకా 35 మంది విద్యార్థులు ఉత్తమ ఫలితాలు అందుకున్నారని అన్నారు. తమ కళాశాలలోని విద్యార్థులు అత్యున్నత స్థాయికి చేరుకోవడమే లక్ష్యం గా పనిచేస్తున్నామన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ భాస్కర్‌రెడ్డి, శ్వేతారెడ్డితోపాటు అధ్యాపకులు పాల్గొన్నారు.

పంట నమోదు పరిశీలన

బి.కోడూరు : మండలంలోని మున్నెల్లి రైతుభరోసా కేంద్రం పరిధిలో రబీలో సాగు చేసిన పంటల నమోదు, ఈకేవైసీని బుధవారం మండల వ్యవసాయాధికారి టి.కౌశిక పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రబీలో పంట నమోదు చేయించుకున్న రైతులు తప్పనిసరిగా ఈకేవైసీ చేయించుకోవాలన్నారు. అలాగే సిబ్బంది పంట నమోదు చేసిన రికార్డులను, వివరాలను రైతులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. శనగ, మినుము పంట ఉత్పత్తులను మద్దతు ధరకు అమ్ముకోవడానికి రైతు తమ గ్రామంలోని రైతుభరోసా కేంద్రానికి వెళ్లి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. అలాగే పీఎం కిసాన్ ఈకేవైసీ చేయించుకోని రైతులు ఇంకా ఎవరైనా ఉంటే చేయించుకోవాలని కోరారు. వ్యవసాయాధికారి వెంట వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

శ్రీవారి దర్శనానికి భక్తుల పాదయాత్ర

ప్రొద్దుటూరు కల్చరల్ : తిరుమల శ్రీవారి దర్శనానికి భక్తులు పాదయాత్ర చేయనున్నట్లు వంగల నారాయణరెడ్డి తెలిపారు. ప్రొద్దుటూరులో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ నియోజకవర్గంలోని 400 మంది భక్తులు గురువారం ఉదయం 7.30 గంటలకు మాజీ ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డి ఆధ్వర్యంలో టీటీడీ కల్యాణ మండపం నుంచి బయల్దేరుతారన్నారు. వీరిలో 40 మంది మహిళా భక్తులు ఉన్నారన్నారు. కుక్కల దొడ్డి వద్ద నుంచి అన్నమయ్య కాలిబాట ద్వారా 15వ తేదీ ఉదయానికి తిరుమల కొండపైకి చేరుకుంటారని తెలిపారు. ఉదయం వారు స్వామివారిని దర్శించుకుంటారన్నారు. రామచంద్రారెడ్డి, గౌస్ లాజం పాల్గొన్నారు.

అక్రమ లే అవుట్లపై చర్యలు తీసుకోవాలి

ఆర్డీఓ శ్రీనివాసులు


మాట్లాడుతున్న ఆర్డీఓ శ్రీనివాసులు

ప్రొద్దుటూరు: వ్యాపార కేంద్రమైన ప్రొద్దుటూరు ప్రాంతంలో ఎక్కువ విస్తీర్ణంలో రియల్ ఎస్టేట్ వ్యాపారులు లే అవుట్లు వేస్తున్నారని జమ్మలమడుగు ఆర్డీఓ శ్రీనివాసులు తెలిపారు. కొంత మంది నిబంధనల ప్రకారం వ్యవసాయ భూమిని వ్యవసాయేతర భూమిగా మార్చుకోకుండానే ప్లాట్లు వేసి అమ్ముతున్నారన్నారు. దీని వలన ప్రభుత్వంతోపాటు కొనుగోలుదారులు కూడా నష్టపోతారని తెలిపారు. కొంత మంది లే అవుట్‌లో కొంత భాగానికి అనుమతి తీసుకుని మిగతా భాగం అనుమతి లేకుండానే ప్లాట్లు వేస్తున్నారని చెప్పారు. ప్రత్యేకించి ప్రొద్దుటూరులో ఎక్కువగా ఇలాంటి అక్రమాలు జరుగుతున్నాయని ఆర్డీఓ వివరించారు. పెన్నా ఏటి పోరంబోకు స్థలాలను ఆక్రమించి శాశ్వత కట్టడాలు కడుతున్నారని ఆర్డీఓ తెలిపారు. ఈ స్థలాలను ప్లాట్లుగా వేసి అమ్ముతున్న సంఘటనలు జరుగుతున్నాయన్నారు. నిత్యం అధికారులు పర్యవేక్షించి పెన్నా ఏటి పోరంబోకు ఆక్రమణలను గుర్తించాలని సూచించారు. బియ్యం అక్రమ రవాణాపై ప్రత్యేక నిఘా ఉంచేందుకు టీంలను ఏర్పాటు చేయాలని తహసీల్దార్ నజీర్ అహ్మద్‌కు సూచించారు. వారంలో మళ్లీ సమీక్ష నిర్వహిస్తానని ఆర్డీఓ తెలిపారు. సమావేశంలో తహసీల్దార్ నజీర్ అహ్మద్, డిప్యూటీ తహసీల్దార్లు మనోహర్ రెడ్డి, సుదర్శన్, రామకృష్ణారెడ్డి, వరద కిశోర్‌రెడ్డి, ఆర్ఐలు సతీష్, నాగమోహన్‌రెడ్డి, వీఆర్ఓలు పాల్గొన్నారు.

రామాలయ నిర్మాణానికి భూమిపూజ

కాశినాయన : మండలంలోని మిద్దెల ఎస్సీకాలనీలో శ్రీపట్టాభి రామాలయ నిర్మాణానికి ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి బుధవారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని పలు గ్రామాల్లోని ఎస్సీ, ఎస్టీ, బీసీ కాలనీల్లో 19 రామాలయాల నిర్మాణాలకు నిధులు మంజూరయ్యాయన్నారు. తిరుమల తిరుపతి దేవస్థానముల వారు ఒక్కొక్క ఆలయానికి రూ.10 లక్షలు నిధులు మంజూరు చేశారన్నారు. మొత్తం కాశినాయన మండలానికి రూ.5 కోట్లు ఆలయ నిర్మాణాలకు నిధులు మంజూరయ్యాయని తెలిపారు. ఆలయ కమిటీ వారు త్వరితగతిన ఆలయాల నిర్మాణం చేపట్టి కేటాయించిన సమయంలో పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ మార్కెట్‌యార్డు వైస్‌చైర్మన్ రమణారెడ్డి, మిద్దెల సర్పంచ్ వెంకటరామిరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు జగన్‌మోహన్‌రెడ్డి, బాలనారాయణరెడ్డి, హనుమంతరెడ్డి, వెంకటరెడ్డి, లక్ష్మిరెడ్డి, యల్లయ్య, పోలయ్య పాల్గొన్నారు.

ఉద్యోగుల బకాయిలను చెల్లించాలి


మాట్లాడుతున్న ఏపీజీఈఏ జిల్లా అధ్యక్షుడు రమేష్ కుమార్

ప్రొద్దుటూరు : ఉద్యోగుల బకాయిలు చెల్లింపులకు చట్టబద్ధత కల్పించాలని ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్ ఎంప్లాయిస్ అసోసియేషన్ (ఏపీజీఈఏ) జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రమేష్‌కుమార్, సుదర్శన్ రెడ్డి తెలిపారు. స్థానిక ఎస్ఎస్ ఫంక్షన్ హాల్‌లో బుధవారం ఏపీజీఈఏ ప్రొద్దుటూరు ఆధ్వర్యంలో ఉద్యోగుల బకాయిలు - చెల్లింపులు - చట్టబద్ధత అంశంపై చర్చా వేదిక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇప్పటికే రావాల్సిన జీపీఎఫ్, ఏపీజీఎల్ఐ, సరెండర్ లీవులు పెండింగ్‌లో ఉండడం వల్ల ఉద్యోగులు చాలా ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ అంశాలపై అవగాహన కల్పించడం కోసం ప్రతి ఉద్యోగిని చైతన్యపరిచి మద్దతు కోరుతున్నామన్నారు. కార్యక్రమంలో కడప తాలూకా అధ్యక్ష, కార్యదర్శులు కృష్ణ ప్రసాద్, నాగరాజు, ఓబుళరెడ్డి, ప్రభాకర్, రాణెమ్మ శ్రీధర్ పాల్గొన్నారు.

మద్యం బాటిళ్లు స్వాధీనం

ప్రొద్దుటూరు క్రైం : కర్నాటక మద్యం బాటిళ్లను విక్రయిస్తున్న వ్యక్తిని సెబ్ అధికారులు అరెస్ట్ చేశారు. దేవాంగపేటకు చెందిన ఆంజనేయులు అనే వ్యక్తి మద్యం బాటిళ్లు విక్రయిస్తున్నాడని సమాచారం రావడంతో సెబ్ ఇన్‌స్పెక్టర్ మోహన్‌రెడ్డి, ఎస్ఐ ఆలీబేగ్ సిబ్బందితో కలిసి బుధవారం దాడులు నిర్వహించారు. దాడిలో ఆంజనేయులు అనే వ్యక్తిని అరెస్ట్ చేసి అతని నుంచి 18 మద్యం ఫుల్ బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి రిమాండుకు తరలించినట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

తలనీలాలకు వేలం పాట

గోపవరం : మల్లెంకొండేశ్వరస్వామి ఆలయంలో శివరాత్రి సందర్భంగా నిర్వహించే బ్రహ్మోత్సవాలకు సంబంధించి భక్తులు సమర్పించే తలనీలాలు రూ.7.24 లక్షలు పలికాయి. బద్వేలు దేవాదాయశాఖ కార్యాలయంలో కార్యనిర్వహణాధికారి సి.శివయ్య ఆధ్వర్యంలో బుధవారం తలనీలాల సేకరణకు వేలంపాట నిర్వహించారు. ఈనెల 17 నుంచి 19 వరకు తలనీలాలు సేకరించేందుకు రూ.5.72 లక్షలు, తలనీలాలకు రూ.1.52 లక్షలు వేలంపాట ద్వారా పాటదారులు దక్కించుకున్నట్లు ఈఓ తెలిపారు.

సీపీఎస్‌ను రద్దు చేయాలి

ప్రొద్దుటూరు కల్చరల్ : రాష్ట్ర ప్రభుత్వం సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానం పునరుద్ధరించాలని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బి.లక్ష్మీరాజా తెలిపారు. బుధవారం హోమస్‌పేట మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో యూటీఎఫ్ పట్టణ కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ముఖ్యమంత్రి సీపీఎస్‌ను రద్దు చేయాలని కోరారు.

మానవ హక్కుల చైర్ పర్సన్‌గా భారతి

కడప సెవెన్‌రోడ్స్ : మానవ హక్కుల పరిరక్షణ సంస్థ ప్రొద్దుటూరు డివిజన్ మహిళా చైర్ పర్సన్‌గా తిరువీధుల భారతి నియమితులయ్యారు. బుధవారం కడప ప్రకాశ్‌నగర్‌లో ఉన్న హెచ్ఆర్‌సీపీఐ కార్యాలయంలో ఆమెకు నేషనల్ చైర్మన్ సింగమాల వెంకట రమణయ్య నియామక పత్రాన్ని అందజేశారు. సంస్థ నాయకులు ఎస్వీ రమణయ్య, డి.శ్యామ్, ప్రవీణ్‌కుమార్, ఈశ్వర్‌రెడ్డి, రాము తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర ప్రజలను బీజేపీ మోసం చేసింది

ప్రొద్దుటూరు కల్చరల్ : రాష్ట్రానికి ప్రత్యేక హోదా, విభజన హామీలు అమలు చేయకుండా 5 కోట్ల ఆంధ్రులను బీజేపీ ప్రభుత్వం మోసం చేసిందని పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి ఓ.నాగేంద్రబాబు ధ్వజమెత్తారు. స్థానిక ఎన్జీఓ హోం కార్యాలయం వద్ద నిర్వహించిన పీడీఎస్‌యూ కడప ఉమ్మడి జిల్లా జనరల్ కౌన్సిల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. నూతన జాతీయ విద్యావిధానం విద్యను వినిమయ సరుకుగా మార్చుతుందని తెలిపారు. అందుకే అనేక మంది మేధావులు ఈ విద్యావిధానాన్ని వ్యతిరేకిస్తున్నారన్నారు. పీడీఎస్‌యూ జిల్లా నాయకులు వెంకటరమణ, రాహుల్, పండ్రేస్, నిషి, చాంద్‌బాషా తదితరులు పాల్గొన్నారు.